# విద్యార్థులు ఇష్టపడి చదవాలి

**- ఉన్నత శిఖరాలను అధిరోహించాలి - గణపురం ఎస్ఐ మచ్చ సాంబమూర్తి**



గణపురం, జర్నలిస్ట్ వార్త ప్రతినిధి: మండలంలోని కస్తూర్బా గాంధీ పాఠశాల విద్యార్థులకు కోటగుళ్ల పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం క పరీక్ష మెటీరియల్ పంపిణీ చేశారు. హైదరాబాద్ సౌత్ జోన్ డిసిపి పోతరాజు సాయి చైతన్య ఐపీఎస్ జన్మదినాన్ని పురస్కరించుకొని ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గణపురం ఎస్ఐ మచ్చ సాంబమూర్తి హాజరయ్యారు. ఈ సందర్భంగా 50 మంది విద్యార్థులకు వారి చేతుల మీదుగా పరీక్ష పరికరాలను అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ పాఠశాలలో తరగతుల వారిగా చదువుతున్న ప్రతీ విద్యార్థి కష్టంగా కాకుండా, ఇష్టపడి చదువుకోవాలని కోరారు. అలా చదువుకున్నప్పుడే విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కోటగుళ్ళ పరిరక్షణ కమిటీ సభ్యులుకస్తూర్బా పాఠశాల ప్రిన్సిపల్ లావణ్య తదితరులు పాల్గొన్నారు.

# మరణ సందేశం పుస్తకావిష్కరణ



వరంగల్ బ్యూరో, జర్నలిస్ట్ వార్త ప్రతినిధి: గ్రేటర్ వరంగల్ పరిధిలోని ప్రెస్ క్లబ్ లో సోమవారం మరణ సందేశం పుస్తకాన్ని ఆవిష్కరించారు. మాదిగల ఐక్య సంక్షేమ సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు మిద్దెపాక రవీందర్ అధ్యక్షత ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కాకతీయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ఆచార్య తాటికొండ రమేష్ చేతులమీదుగా పుస్తకం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షులు వేముల నాగరాజు, ప్రధాన కార్యదర్శి బొల్లారం సదయ్య, సీనియర్ జర్నలిస్టు వరంగల్ వాయిస్ ఎడిటర్ గడ్డం కేశవమూర్తి, చిన్న పత్రికల సంఘం వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు అంతడుపుల శ్రీనివాస్, వీసికే పార్టీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ జిలుకర శ్రీనివాస్, అడ్వకేట్ అంబేద్కరిస్ట్ బండి మొగిళి, వరంగల్ రచయితల సంఘం అధ్యక్షులు నల్లెల్ల రాజయ్య, రచయిత శోభారమేష్, కవి రచయిత డాక్టర్ కట్కూరి మహేందర్, జన సాంస్కృతిక మండలి రాష్ట్ర కన్వీనర్ మామిండ్ల రమేష్ రాజా, తెలంగాణ సాహితీ వరంగల్ ఉమ్మడి జిల్లా కన్వీనర్ కోగిల చంద్రమౌళి, తదితరులు హాజరై ప్రసంగించారు.

# మేడారం జాతరకు భారీగా క్యూ కడుతున్నాయి

**- భక్తులు అధిక సంఖ్యలో తరలి వస్తున్నారు**

ములుగు, జర్నలిస్ట్ వార్త ప్రతినిధి: తాడ్వాయి మండలం మేడారం జాతరకు భక్తులు అధిక సంఖ్యలో తరలి వస్తున్నారు. సోమవారం జాతరకు వెళ్లే రహదారిలో వాహనాలు భారీగా క్యూ కడుతున్నాయి. దీంతో జాతర సమీపం జనసంద్రంగా మారుతుంది. మహా జాతర దగ్గరపడుతున్న కొద్దీ భక్తుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. వనదేవతల దర్శనార్థమై భక్తులు బారులు తీరుతున్నారు. రాష్ట్ర నలుమూలల నుంచే కాకుండా ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, ఒడిశా తదితర రాష్ట్రాల్లోని భక్తులు వనదేవతల దర్శనానికి తరలివస్తున్నారు. దూర ప్రాంతాల నుంచి తరలివస్తున్న భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు ఎదురవకుండా అధికారులు అప్రమత్తమై చర్యలు చేపడుతున్నారు.

# వృత్తి ధర్మాన్ని పాటిస్తున్న ఉత్తమ డాక్టర్లు



వర్ధన్నపేట, జర్నలిస్ట్ వార్త ప్రతినిధి: వర్ధన్నపేట సామాజిక ఆరోగ్య కేంద్రం ప్రభుత్వ ఆసుపత్రిలో పని చేస్తున్న డాక్టర్లు వైద్య వృత్తి ధర్మానికి న్యాయం చేస్తున్నారు. వారి కష్టానికి ప్రతిఫలంగా 2024 జనవరి 26 గణతంత్ర దినోత్సవం సందర్భంగా వర్ధన్నపేట ప్రభుత్వ ఆసుపత్రి సూపరిం టెండెంట్ డాక్టర్ నరసింహ స్వామికి ఉత్తమ సేవ అవార్డు దక్కింది. వారి వైద్య సేవలను గుర్తించి ఆయనతో పాటు పని చేస్తున్న వర్ధన్నపేట ప్రభుత్వ ఆసుపత్రి డాక్టర్లకు వివిధ సందర్భాల్లో ఇప్పటివరకు 7 ఉత్తమ డాక్టర్లుగా అవార్డులు స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే డాక్టర్ నరసింహస్వామి 2018, 2019, 2024 సంవత్సరాల్లో జిల్లా కలెక్టర్ల చేతుల మీదుగా 3 అవార్డులు పొందినారు. డాక్టర్ సోమశేఖర్ 2020 సంవత్సరంలో ఉత్తమ సేవా అవార్డు, 2023 సంవత్సరంలో ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవం సందర్భంగా ఉత్తమ డాక్టర్ అవార్డులు పొందినారు. 2023 ఆగస్టు 15 సందర్భంగా డాక్టర్ కవిత, డాక్టర్ కృష్ణ లకు ఉత్తమ డాక్టర్లుగా అవార్డులు స్వాధీనం చేసుకున్నారు. ఇలా డాక్టర్లు కలిసి కట్టుగా వైద్య సేవలు నిర్వహిస్తూ, వర్ధన్నపేట నియోజకవర్గం మాత్రమే కాకుండా, వివిధ ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలకు సరైన వైద్య సేవలు అందిస్తూ ఉత్తమ డాక్టర్లుగా పేరొందుతున్నారు. వర్ధన్నపేట మున్సిపల్ పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి 30 పడకల ఆసుపత్రి ఐనప్పటికీ తక్కువ సామర్థ్యం కలిగిన ఆసుపత్రిలో అనుభవజ్ఞులైన డాక్టర్లు ఉండటం స్థానిక ప్రజలకు అదృష్టంగా మారింది. అందుకు నిదర్శనంగా ఒక్క నెలలో దాదాపు 200 నుంచి 250 ప్రసవాలు చేస్తూ, ఎలాంటి ప్రమాదం లేకుండా ఎంతోమంది చిన్నారులకు పునర్జన్మ ప్రసాదిస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో పేషెంట్లకు చికిత్స అవసరమైతే సమయ, సందర్భం లేకుండా డాక్టర్ భరత్ అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తున్నారని చెప్పవచ్చు. గత కొద్ది రోజుల క్రితం ఒకే రోజు రాత్రంతా కష్టపడి 10 మందికి డెలివరీలు చేసి పది మంది బాలింతలు, పదిమంది చిన్నారులకు పునర్జన్మను ప్రసాదించిన ఆయనకు కృతజ్ఞులమై ఉంటామని వైద్య సేవలు పొందినవారు ఆయనను అభినందిస్తున్నారు. 30 పడకల ఆసుపత్రిలో 100 పడకల సామర్థ్యం కలిగిన ఆసుపత్రిగా ప్రజలకు సేవలు అందిస్తున్న వారిని స్థానికులు అభినం దిస్తూ, కృతజ్ఞతగా శాలువాలతో సన్మానిస్తున్నారు. సన్మానించిన వారిలో కుమారస్వామి, కరుణాకర్, నాగరాజు, సుదర్శన్, భాస్కర్, నాగార్జున, మధు, రమేష్ తదితరులు ఉన్నారు.

# బీఆర్ఎస్ పార్టీ అధికారంలో లేకున్నా...

# తెలంగాణ ప్రజల పక్షాన్నే పనిచేస్తుంది

**- వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్**



వరంగల్ బ్యూరో, జర్నలిస్ట్ వార్త ప్రతినిధి: వరంగల్ హంటర్ రోడ్డులోని సీఎస్ఆర్ గార్డెన్లో వర్ధన్నపేట మాజీ అరూరి రమేష్ అధ్యక్షతన సోమవారం వర్ధన్నపేట నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, ఎర్రబెల్లి దయాకర్ రావు, ఎంపి పసునూరి దయాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల్లో గెలుపు, ఓటములు సహజమన్నారు. మొన్న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ఓడిపోయినప్పటికీ నియోజకవర్గ ప్రజల పక్షాన్నే పని చేస్తోందన్నారు. సమస్యల పరిష్కారానికి, అభివృద్ధికి కృషి చేస్తామని అన్నారు. గత ప్రభుత్వ హయాములో చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలను కొనసాగిస్తూనే, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారెంటీలను అమలు చేయాలన్నారు. ఎన్నికల్లో ఓట్లకోసం పోటీ పడిన విధంగానే వర్ధన్నపేట నియోజకవర్గ అభివృద్ధి కోసం ప్రస్తుత నాయకులు పోటీ పడాలన్నారు. బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు నియోజకవర్గ అభివృద్ధికి నిధులు తీసుకువచ్చినట్లు వాళ్ళు తీసుకురావాలన్నారు. నియోజకవర్గ పరిధిలో రైతుబంధు, సీఎంఆర్ఎఫ్, కళ్యాణలక్ష్మి సహాయం కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారని తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం వెంటనే ప్రజలకు సంక్షేమ పథకాలు అందజేయాలన్నారు. గత శాసనసభ ఎన్నికల్లో ఓటమికి దారి తీసిన పరిస్థితులని సమీక్షించుకొని తిరిగి పార్టీ బలోపేతానికి కృషి చేస్తామన్నారు. వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలు కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలన్నారు. అభివృద్ధి స్వాగతిస్తామన్నారు. లేకుంటే ప్రజా సమస్యలు, నియోజకవర్గ అభివృద్ధిపైన ప్రజల పక్షాన ఉండి ప్రభుత్వంపై పోరాటం మొదలెడతామని చెప్పారు. పదేళ్లలోనే 50 ఏండ్ల అభివృద్ధిని కండ్లకు కట్టినట్లుగా చూపిన ఘనత బీఆర్ఎస్ సర్కార్ కు దక్కుతుందని అన్నారు.

రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ జెండా ఎగరేద్దామని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

**మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి**

ఓటమిపై సమీక్షించుకుని రాబోయే రోజుల్లో పార్టీ బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. మూడోసారి మోడీకి ఓట్లు ఎందుకు వేయాలని ప్రశ్నించారు. అక్షింతల పేరుతో రాజకీయాలు చేస్తున్నారని వివరించారు. రైతాంగానికి కాంగ్రెస్ ప్రభుత్వం రైతుబంధు ఇవ్వకుండా మోసం చేస్తుందన్నారు. కెసిఆర్ కంటే ఉన్నతంగా ఇస్తామని చెప్పి ఇప్పుడు ఏమైందన్నారు. ప్రజలు కాంగ్రెస్ మాయ మాటలు నమ్మి మోసపోయారని వాపోయారు. వంద రోజుల్లో కాకపోతే, 5 సంవత్సరాలలోపు మీ హామీలు నెరవేర్చండి లేదంటే ప్రజలు మీ హామీలపై నిలదీస్తారని హెచ్చరించారు.

**మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు**

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత డిసెంబర్ 9వ తేదీన రైతుబంధు రైతుల ఖాతాలో వేస్తామని చెప్పారు. ఇంకా వెయ్యలేదు ఎందుకని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా పూర్తిగా విఫలమవుతోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన 50 రోజులలోనే బిఆర్ఎస్ ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలపైన భౌతిక దాడులు చేస్తున్నారు. బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలకు కష్టం వస్తే అందరం ఒకటి కావాలన్నారు. కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియాలో విష ప్రచారం చేసి అధికారంలోకి వచ్చిందన్నారు. చిన్న చిన్న కారణాలతో మనం ఓడిపోయాం, కార్యకర్తల సూచనలు పరిగణనలోకి తీసుకొని పార్టీని బలోపేతం చేద్దామని పిలుపునిచ్చారు. అనంతరం నియోజకవర్గంలోని వివిధ మండలాల వారీగా గ్రామాల సర్పంచులు పదవి కాలం ఈనెల ముగుస్తుండడంతో వారికి అరూరి రమేష్ చేతుల మీదుగా, వారి సేవలకు గుర్తింపుగా సర్పంచులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్ రావు, జిల్లా రైతు బందు కో ఆర్డినేటర్ లలితా యాదవ్, జిల్లా జెడ్పీ వైస్ చైర్మన్ శ్రీరాములు, జిల్లా కో ఆప్షన్ సభ్యులు ఉస్మాన్ అలీ, సర్వర్, కార్పొరేటర్లు, పిఏసిఎస్ చైర్మన్లు, మండల, డివిజన్, గ్రామశాఖ, పార్టీ అధ్యక్షులు, సర్పంచులు, ఎంపిటిసిలు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరణ...

- ఘన స్వాగతం పలికిన గ్రామ ప్రజలు...
- అంబేద్కర్ ఆలోచనా విధానం నేటి తరానికి ఆదర్శం..
- ఎమ్మార్పీఎస్ మహబూబాద్ జిల్లా ఇన్చార్జ్ బిర్రు మహేందర్ మాదిగ..







దంతాలపల్లి,జర్నలిస్ట్ వార్త ప్రతినిధి

రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆలోచనా విధానం నేటి తరానికి ఆదర్శప్రాయమని ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి మహబూబాద్ జిల్లా ఇన్చార్జ్ బిర్రు మహేందర్ మాదిగ అన్నారు. అదివారం మహబూబాద్ జిల్లా దంతాలపల్లి మండలం రేపోని గ్రామంలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమం చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి మాదిగల సూర్యుడు మాన్యశ్రీ మందకృష్ణ మాదిగ ముఖ్య అతిథులుగా రావాల్సి ఉన్నప్పటికీ అనివార్య కారణాలవల్ల రాలేకపోయారని తన ఆదేశాల మేరకు ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి మహబూబాద్ జిల్లా ఇన్చార్జ్ బిర్రు మహేందర్ మాదిగ ముఖ్య అతిథిగా హాజరు కాగా గ్రామస్తులంతా డబ్బు చప్పులతో ఘన స్వాగతం పలికారు. గ్రామంలో పురవీధుల్లో బాబా సభ అంబేద్కర్ నినాదాలు చేస్తూ విగ్రహం వద్దకు చేరుకునీ మహేందర్ చేతుల మీదుగా విగ్రహావిష్కరణ చేయడం జరిగినది. అనంతరం తప్పెట్ల శంకర్ మాదిగ అధ్యక్షతన ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఈ ఎమ్మార్పీఎస్, ఎంఎస్పి, మహబూబాద్ జిల్లా ఇన్చార్జి బిర్రు మహేందర్ మాదిగ హాజరై మాట్లాడుతూ బాల్యం నుండి వివక్షను ఎదుర్కొంటూ భారతదేశ ప్రజాస్వామ్య వ్యవస్థలో అత్యంత కీలకమైన రాజ్యాంగాన్ని రూపొందించే స్థాయికి ఎదిగిన బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించడం తన అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. సమాజంలో అస్పృశ్యతను నివారిర్చడం నుండి మానవ సమాజాన్ని సమైక్యం చేయడంలో కీలక పాత్ర పోషించారన్నారు. న్యాయవాదిగా, ఆర్థిక శాస్త్రవేత్తగా, రాజకీయ నేతగా, సంఘసంస్కర్తగా విభిన్న పాత్రలు పోషించిన మహా నాయకుడు అంబేద్కర్ అని కొనియాడారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రాజ్యాంగం రాసిన మూలంగానే అట్టడుగు వర్గాలకు దళితులకు స్వేచ్ఛ సమానత్వం రావడం జరిగిందన్నారు. అంబేద్కర్కలలుగన్న రోజు రావాలని కొనియాడారు. అంబేద్కర్ ని ఆదర్శంగా తీసుకోని ప్రతి ఒక్కరూ చదువుతూ పోరాడి మన జాతులను మేల్కొల్పి చైతన్య పరచాలని కోరారు. జాతీయ ఐక్యత కోసం మందకృష్ణ మాదిగ చేస్తున్న ఏ,బి,సి,డి, వర్గీకరణ పోరాటం తుది దశకు చేరిందని ఆనందోత్సవాలతో సంబరాలు చేసుకునే సమయం ఆసన్నమైందని సూచించారు. జాతి సమానత్వం, జాతి ఐక్యత, అభివృద్ధి దిశగా ప్రతి ఒక్కరు ఆలోచన బదులు కావాలని కోరారు. గ్రామ సర్పంచ్ నాగిరెడ్డి శైలజ వెంక రెడ్డి హాజరై మాట్లాడుతూ బాబాసాహెబ్ అంబేద్కర్ ఒక వర్గానికి చెందిన వాడు కాదు అంబేద్కర్ అందరివాడు అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ కొంపల్లి పద్మ వెంకన్న, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు చాగంటి రమేష్ మాదిగ, అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షులు ధర్మారపు పవన్ కుమార్ మాదిగ ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి జిల్లా సీనియర్ నాయకులు మిడతపల్లి వెంకన్న మాదిగ, ఎం ఈ ఎఫ్ జిల్లా నాయకులు నకరికంటి వెంకన్న మాదిగ, తలారి అశోక్ మాదిగ వెంకటేష్ మాదిగ రాము మాదిగ సతీష్ మాదిగ వెంకన్న మాదిగ ఉపేందర్ మాదిగ మిడితపల్లి చంద్రు మాదిగ ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు చెంచలి వెంకన్న మాదిగ,నరసన్న మాదిగ, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధలు స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



# స్టార్ హీరో సరసన ఛాన్స్ కొట్టేసిన దేవర హీరోయిన్.. ఎవరంటే?

శ్రీదేవి ముద్దుల కూతురు, బాలీవుడ్ భామ జాన్వీ కపూర్ ఇప్పటికే టాలీవుడ్ ఎంట్రీ ఖాయమైంది. జూనయర్ ఎన్టీఆర్ సరసన దేవర చిత్రంలో కనిపించనుంది. కొరటాల శివ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం శరవేగంగా షూటింగ్ జరుగుతోంది.బాలీవుడ్ సినిమాల్లో అరంగేట్రం చేసిన ముద్దుగుమ్మ.. ఇప్పుడు సౌత్‌లోనూ అడుగుపెడుతోంది. ఇప్పటికే టాలీవుడ్ క్రేజీ ఛాన్స్ కొట్టేసిన జాన్వీ మరో జాక్ పాట్ తగినలినట్లు లేటేస్ట్ టాక్. అదేంటో తెలుసుకుందాం.

కోలీవుడ్ స్టార్ హీరో సూర్య, బాలీవుడ్ డైరెక్టర్ రాకేశ్ ఓంప్రకాశ్ మిశ్రా క్రేజీ ప్రాజెక్ట్ కర్ణలో నటించనున్నట్లు వార్తలొస్తున్నాయి. మహాభారతంలోని కర్ణుడి పాత్రను ఆధారంగా ఈ సినిమాను తెరకెక్కిస్తున్నట్లు వార్తలొస్తున్నాయి. ఇప్పటికే ఈ సినిమాకు సంబంధించి ప్రీ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఈ చిత్రాన్ని రూ.500 కోట్ల భారీ బడ్జెట్‌తో రూపొందిస్తున్నట్లు సమాచారం. ఈతాజాగా ఈ సినిమాలో జాన్వీ కపూర్‌ను హీరోయిన్‌గా ఎంపిక చేసినట్లు బీటౌన్‌లో టాక్ నడుస్తోంది. ఈ విషయంపై ఇప్పటికే మేకర్స్ ఆమెను సంప్రదించినట్లు సమాచారం. అయితే ఈ విషయంపై జాన్వీ కపూర్ టీమ్ కానీ, మేకర్స్ నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు.

## వాలంటైన్స్‌డే గిఫ్ట్.. ఓటీటీలోకి సూపర్ హిట్ రొమాంటిక్ లవ్ స్టోరీ చిత్రం

ప్రతి వారం ఓటీటీలోకి కొత్త సినిమాలు వస్తూనే ఉంటాయి. ఇప్పటికే ప్రేమ కథలతో పాటు థ్రిల్లర్ చిత్రాలు కూడా ఓటీటీలో స్ట్రీమింగ్ అవుతున్నాయి. అలాంటిది ప్రేమికుల దినోత్సవం రోజున ఎలాంటి సినిమా ఉంటే బాగుంటుందో అలాంటి రొమాంటిక్ డ్రామా మూవీని ఓటీటీలోకి తీసుకొస్తున్నట్లు హాట్‌స్టార్ తెలిపింది. తమిళంలో సూపర్ హిట్ కొట్టిన 'సభా నాయగన్' స్ట్రీమింగ్‌కు రెడీగా ఉంది. ఇందులో కలర్ ఫొటో సినిమాతో గుర్తింపు తెచ్చుకున్న 'చాందిని చౌదరి' ప్రధాన పాత్రలో నటించింది.భద్రమ్, మన్మథ లీల, పిజ్జా 2 సినిమాలతో 'అశోక్ సెల్వన్' హీరోగా మంచి గుర్తింపు తెచ్చుకున్నాడు. ఇప్పటికే ఆయన నటించిన అనేక తమిళ చిత్రాలు తెలుగులోకి డబ్ అయ్యాయి. దీంతో టాలీవుడ్‌లో కూడా అశోక్ సెల్వన్‌కు గుర్తింపు ఉంది. చాందినీ చౌదరితో కలిసి నటించిన సభా నాయగన్ చిత్రం 2023 డిసెంబర్‌లో విడుదలైంది. రొమాంటిక్ డ్రామాగా తెరకెక్కిన ఈ చిత్రంలో ముగ్గురు హీరోయిన్స్ ఉన్నారు.






# అలా అయితేనే ఆ సీన్స్ చేస్తా: మీనాక్షి చౌదరి

ఇటీవలే టాలీవుడ్ ప్రిన్స్ మహేశ్ బాబు నటించిన చిత్రం గుంటూరు కారం. త్రివిక్రమ్– మహేశ్ కాంబోలో వచ్చిన ఈ సినిమా సంక్రాంతి కానుకగా థియేటర్లలో రిలీజైంది.అయితే బాక్సాఫీస్ వద్ద మిక్స్‌డ్ టాక్‌ను సొంతం చేసుకుంది. ఈ సినిమా ద్వారా తెలుగు ప్రేక్షకులకు దగ్గరైన హర్యానా బ్యూటీ మీనాక్షి చౌదరి. ఈ సినిమాలో తనదైన నటనతో టాలీవుడ్ సినీ ప్రియులను అలరించింది.

అయితే తాజా ఇంటర్వ్యూలో పలు ఆసక్తికరమైన కామెంట్స్ చేసింది ముద్దుగుమ్మ. అవకాశం వస్తే అలాంటి సన్నివేశాల్లో నటించడానికి తనకు ఎలాంటి అభ్యంతరం లేదని చెప్పుకొచ్చింది. అయితే కొన్ని కండిషన్స్ ఉన్నాయని వెల్లడించింది.

మీనాక్షి చౌదరి మాట్లాడుతూ..' మహేశ్ బాబుతో ఛాన్స్? అనగానే నా సంతోషానికి అవధులు లేవు. తొలి రోజే సెట్‌లో ఆయనతోనే నటించా. మొదట కంగారు పడ్డా. కానీ టెన్షన్ పడకుండా ఇంకాస్త సమయం తీసుకోమని మహేశ్ నాకు ధైర్యం చెప్పారు. కానీ సినిమాల్లో నా కోసం కొన్ని నియమాలు పెట్టుకున్నా. తెరపై ముద్దు సీన్స్‌కు సంబంధించి కొన్ని రూల్స్ కచ్చితంగా పాటిస్తా. స్క్రిప్ట్ డిమాండ్‌ను చేస్తే తప్ప అలాంటి వాటికి ఒప్పుకోను. అది కూడా మరీ అసభ్యకరంగా లేకుంటేనే చేస్తా. కేవలం కిస్? సీన్స్? కోసమే అంటే కచ్చితంగా నో చెప్పేస్తా.' అంటూ తన మనసులోని మాటలను పంచుకుంది.

అనంతరం మాట్లాడుతూ.. ముఖ్యంగా తెలుగు ప్రేక్షకులు నా పట్ల ఎంతో ఆప్యాయతను చూపిస్తున్నారని తెలిపింది. భాషతో సంబంధం లేకుండా మంచి సినిమాలు చేయాలనేదే తన కోరికని వెల్లడించింది. అందువల్లే కథల విషయంలో ఆలోచించి నిర్ణయం తీసుకుంటున్నట్లు పేర్కొంది.

రెమ్యునరేషన్ కంటే.. నటనకే ప్రాధాన్యత ఇస్తానని అంటోంది మీనాక్షి చౌదరి. కాగా.. తెలుగులో ఇచ్చట వాహనములు నిలుపరాదు అనే చిత్రంలో పరిచయమైంది. ఆ తర్వాత రవితేజ సరసన 'ఖిలాడి', అడివి శేష్‌తో కలిసి 'హిట్ 2' సినిమాలతో హిట్స్ సాధించింది.

# నాన్నా.. మీరే నా ఆదర్శం

## మెగాస్టార్ కూతురు ట్వీట్

టాలీవుడ్ మెగాస్టార్ చిరంజీవికి దేశంలోనే రెండో అత్యున్నత పురస్కారం లభించింది. 75వ గణతంత్రం దినోత్సవం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం చిరంజీవికి పద్మ విభూషణ్ ప్రకటించింది.

తాజాగా మెగాస్టార్ పెద్దకూతురు సుస్మిత శుభాకాంక్షలు చెబుతూ ట్వీట్ చేసింది. నాన్న మీరు ఒక స్ఫూర్తి, గౌరవం, ఆశీర్వాదం కూడా. పద్మవిభూషణ్ వచ్చినందుకు మీకు ప్రత్యేకంగా అభినందనలు. అలాదే ఈ ఏడాదిలో పద్మ అవార్డులు దక్కించుకున్న అందరికీ నా హృదయపూర్వక కృతజ్ఞతలు' అంటూ పోస్ట్ చేసింది.

తెలుగు సినీ చరిత్రలో అక్కినేని నాగేశ్వరరావు తర్వాత ఈ ఘనత అందుకున్న నటుడిగా మెగాస్టార్ నిలిచారు. ఈ సందర్భంగా పలువురు సినీ ప్రముఖులు, రాజకీయ నాయకులు చిరంజీవికి అభినందనలు తెలిపారు. మెగా కోడలు ఉపాసన సైతం మామయ్యకు కంగ్రాంట్స్ చెబుతూ ట్వీట్ చేసింది.





# 'అతని అతిపెద్ద భయం అదే'

టాలీవుడ్ యంగ్ హీరో విశ్వక్ సేన్ నటిస్తోన్న తాజా చిత్రం 'గామి'. ఈ సినిమాలో చాందినీ చౌదరి హీరోయిన్‌గా కనిపించనుంది. ఈ చిత్రం ద్వారా విద్యాధర్ డైరెక్టర్‌గా పరిచయం అవుతున్నారు.

తాజాగా ఈ చిత్రం ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు మేకర్స్. ఈ విషయాన్ని చిత్ర నిర్మాణ సంస్థ యూవీ క్రియేషన్స్ ట్వీట్ చేసింది.

నిర్మాణ సంస్థ ట్వీట్‌లో రాస్తూయ..'అతని అతిపెద్ద భయం మానవ స్పర్శ. అతని లోతైన కోరిక కూడా మానవ స్పర్శే. ఒక వ్యక్తి ప్రత్యేకమైన కథ.. అతని అతిపెద్ద భయాన్ని జయించటానికి ప్రయాణం' అంటూ క్యాప్షన్ ఇచ్చారు. కాగా.. ఫస్ట్ లుక్ పోస్టర్ చూస్తే అఘోర పాత్రలో కనిపించనున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం త్వరలోనే థియేటర్లకు రానుంది.

కాగా.. ఈ సినిమాను ఉద్దేశించి ఇటీవలే ఓ ఇంటర్వ్యూలో విశ్వక్ సేన్ ఆసక్తికర కామెంట్స్ చేశారు. ఈ సినిమా కోసం దాదాపు నాలుగున్నర ఏళ్లుగా కష్టపడుతున్నానని తెలిపారు. తన పాత్ర చాలా విభిన్నంగా ఉంటుందని.. ఈ చిత్రాన్ని హిమాలయాలు, వారణాసి లాంటి ప్రాంతాల్లో తెరకెక్కించినట్లు వివరించారు. కథ విషయంలో డైరెక్టర్ ఫుల్ క్లారిటీతో ఉన్నారని విశ్వక్ సేన్ తెలిపారు.

# యానిమల్ చిత్రాన్ని వెంటనే తొలగించండి

## నెట్‌ఫ్లిక్స్‌పై ఫైర్!

ఓటీటీ ప్రియులు ఎప్పటి నుంచో ఎదురుచూస్తున్న చిత్రం 'యానిమల్'. ఈ సినిమా గణతంత్రం దినోత్సవం రోజునే ఓటీటీలోకి వచ్చేసింది. రిపబ్లిక్ డే కానుకగా నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ అవుతోంది.తెలుగుతో పాటు హిందీ, దక్షిణాది భాషల్లో ప్రస్తుతం అందుబాటులోకి వచ్చేసింది. సినీ ప్రేక్షకులు ఈ చిత్రాన్ని తెగ చూసేస్తున్నారు.
సందీప్ రెడ్డి వంగా తెరకెక్కించిన ఈ చిత్రం డిసెంబరు 1న థియేటర్లలో రిలీజై బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని అందుకుంది. అయితే అంతే స్థాయిలో విమర్శలు కూడా ఎదుర్కొంది.అయితే తాజాగా ఓటీటీలో స్ట్రీమింగ్ అవుతోన్న ఈ చిత్రంపై నెటిజన్స్ ఫుల్ ఫైర్ అవుతున్నారు. నెట్‌ఫ్లిక్స్ నుంచి ఈ సినిమాను తొలగించాలంటూ డిమాండ్ చేస్తున్నారు. ట్విటర్ ద్వారా నెటిజన్స్ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అసలు ఎందుకిలా యానిమల్ చిత్రంపై వ్యతిరేకత వస్తోంది? దీని వెనుక ఉన్న కారణాలేంటో ఓసారి తెలుసుకుందాం.
అయితే ఈ చిత్రంపై థియేటర్‌లో రిలీజ్ అయినప్పటి నుంచి విమర్శలు వస్తూనే ఉన్నాయి. స్త్రీలను కించపరిచేలా కొన్ని సన్నివేశాలు ఉన్నాయంటూ పలువురు సినీ ప్రముఖులతో పాటు రాజకీయ నాయకులు సైతం తప్పుపట్టారు. ఈ సినిమా స్త్రీల పట్ల ద్వేషాన్ని పెంపొందించేలా ఉందంటూ పలు సందర్భాల్లో విమర్శించారు. తాజాగా ఓటీటీలో రిలీజ్ కాగా.. ఈ సినిమా చూసిన నెటిజన్స్ మేకర్స్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి చిత్రాలను ఎలా ప్రసారం చేస్తారని నెట్‌ఫ్లిక్స్‌ను ప్రశ్నిస్తున్నారు. తక్షణమే ఓటీటీ నుంచి యానిమల్‌ను తొలగించాలంటూ డిమాండ్ చేస్తున్నారు.ఒక




నెటిజన్ తన ట్వీట్‌లో రాస్తూ.. "నేను యానిమల్ చిత్రం చూసి కలత చెందా. ఈ సినిమా భారతీయ మహిళలను కించపరిచేలా ఉంది. ఇది భారతీయ వివాహ బంధాలపై వ్యతిరేక ప్రభావం చూపుతోంది. మన సంప్రదాయం, వారసత్వం ప్రకారం ఒక వ్యక్తికి ఒకే భార్య అన్న భావనకు భంగం కలిగిస్తోంది. దయచేసి ఇలాంటి సినిమాపై చర్యలు తీసుకోండి.' అంటూ పోస్ట్ చేశారు. ఈ సందర్భంగా నయనతార నటించిన ?అన్నపూరణి చిత్రం నెట్‌ఫ్లిక్స్ తొలగించిన విషయాన్ని నెటిజన్స్ గుర్తు చేస్తున్నారు.మరో నెటిజన్స్ రాస్తూ..'దయచేసి నెట్‌ఫ్లిక్స్ నుంచి యానిమల్ సినిమాని తీసేయండి. ఇది మహిళలపై ఘోరమైన హింసను ప్రతిబింబిస్తోంది.